# 'కవిసామ్రాట్ పురుషోత్తము చౌధరి'




**సెప్టెంబర్ 5, 1803 - సెప్టెంబర్ 5, 2003**

**- సి. సరోజినీ చంద్రశేఖర్**

**పురుషోత్తము చౌధరి** గారి 200 సంవత్సరముల జన్మదిన (5-9-1803) సందర్భమున, ఆయన జీవితములోని కొన్ని సంఘటలను గురించి మనము తెలుసుకుందాము.

**పూర్వికుల చరిత్ర** : 1798వ సంవత్సరమున శ్రీ రాజా జగపతి దేవుగారు పర్లాకిమిడి జమీందారుగా నుండిరి. ఆ కాలములో కూర్మనాధ చౌధరి గారు చాలా సుప్రసిద్ధులు. వీరు వేదపారాయణం చేయుటలో చాలా ప్రవీణుడు. పర్లాకిమిడి ఆస్థాన కవిగానుండిరి. ఆ కాలములో చౌధరిగారి వంశము మిక్కిలి ప్రసిద్ధిచెందింది. కుర్మానాధ చౌధరిగారి పూర్వికులు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు. రెండు, మూడు తరాలకు ముందు బెంగాల్ నుండి ఉత్కళకు తరలి వచ్చి పర్లాకిమిడి ప్రాంతాన స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు మరియు బహు నిష్ఠ కలిగిన అగ్రజాతీయులు. ఆనాడు వీరికి పరిసర ప్రాంతముల యందు చాలా గౌరవ ప్రతిష్ఠలు కలిగి ఉండెను. ఈ **'చౌధరి'** కుటుంబము వైదికవృత్తి, కరణవృత్తిచే జీవించేవారు. **'చౌధరి'** అను పదమునకు నాలుగు గ్రామముల మీద అధికారికి యివ్వబడిన బిరుదు. చతుర్వేద (నాలుగు వేదములు) పారాయణులకు కూడా ఈ బిరుదు వర్తిస్తుంది.

**జననం** : 1803 సెప్టెంబర్ 5వ తేదీన గంజాం జిల్లా, తెంబూరు ముఠా, మదనాపుర గ్రామమున, కుర్మనాధ చౌధరి గారి భార్య అయిన సుభద్రాదేవి చౌధరాణి మగబిడ్డను ప్రసవించింది. జాతక ప్రకారము ఆ బిడ్డకు **'పురుషోత్త'** ముడని పేరు పెట్టినారు. దినదినము బాల బాస్కరునివలె వెలుగుచు వచ్చెను.

**విద్యాభ్యాసము** : 7వ యేట అక్షరాభ్యాసము చేసినారు. పాఠశాలలో, ఇటు ఇంటి వద్ద తండ్రి చేత చిన్న చిన్న శ్లోకాలు ఎన్నో **పురుషోత్తముడు** నేర్చుకొనెను. చిన్ననాటి నుండి అన్ని విషయములలో ప్రవీణుడు. బ్రాహ్మణ ఆచార ప్రకారముగా ఏడవ యేట ఉపనయనము చేసిరి. మంత్రాలు, జపాలు అన్నియు శ్రద్ధతో నేర్చుకున్నాడు. బాల్యము నుండి పురుషోత్తముడు మతనిష్టగలవాడు.

**ఆంధ్రక్రైస్తవ పితామహుడు, మహాకవి, కీర్తనాకారుడు**

**మతనిష్టగలవాడు** : తన తండ్రివలె కుమారుడు కూడా మంచి పేరు తెచ్చుకొనెను. చక్కని స్వరము కలిగి, తన గాన మాధుర్యము వలన ప్రతివారి హృదయాన్ని ఆకట్టుకొనెను. దైవభక్తి, పారాయణము, వేదాంతాన్ని తండ్రి ఎల్లప్పుడు బోధించేవాడు. తల్లిగారైన సుభద్రాదేవి తన కుమారున్ని మహామత బోధకుడు కావాలని మనసార దీవించేది. అతని తల్లి వాక్కు నెరవేరింది. వేదవైద్యుడని ప్రఖ్యాతిగాంచెను. నిత్యము పూజలో ఉండేవాడు. భుజముల మీద శంకు చక్రాలను కాల్పించుకొని గురోపదేశములు తప్పక పాఠించేవాడు. మంచి దేహఛాయ, దానికి తగినట్టు పట్టు బట్టలు ధరించి దారిన పోవుచున్నప్పుడు ప్రజలు ఆయనకు నమస్కరించేవారు. నడకలో రాజఠీవి కనబడేది. ఈయన మాటలు వినుటకు ప్రజలు గుమికూడేవారు. ఆస్థానకవిగా పురుషోత్తముడు కూడా కొంత కాలము పనిచేసెను.

**వివాహము** : తన మేనమామగారైన రఘునాథపాల్ మహంతిగారి కుమార్తె అయిన రాధామణి దేవితో తన 20వ యేట వివాహము జరిగింది. వీరి వివాహమైన కొన్ని దినముల తరువాత తండ్రిగారైన కూర్మనాధ చౌధరి మరణించారు. తండ్రి తదనంతరం ఈ కవి హైందవ గ్రంథ రచనలను చేయడం ప్రారంభించాడు. కొన్ని కీర్తనలు కూడా రచించాడు.

**గ్రంథముల పరిశీలన** : భక్తి, వైరాగ్య, జ్ఞానకర్మ రాజయోగి కాగల సాదనములన్నిటిలోను శిక్షణపొందెను. **"రాజహస్తరాజము"** అను వేదాంత గ్రంథము నొసంగి అందలి భావములలో దీక్ష పఠించెను. ఆత్మ యొక్క నిత్యత్వమును, జీవాత్మ పరమాత్మల వైరాగ్య పరసిద్ధాంతాన్ని సద్గురుని ద్వారా సాధించవలెననియు, అట్టి సాధనలేనిచో ముక్తి సౌఫల్యత సిద్ధించదనియు ఆ వేదాంత గ్రంథము యొక్క సారాంశము. ఈ విధంగా తరచు వేదాంత గ్రంథములు సేకరించి

చదువుచుండెను. రకరకములైన వేదాంత సిద్ధాంతాలు, **పురుషోత్తము** గారిని కలవరపరిచేది. ఇవన్ని సరియైన మార్గము కాదేమో! అని లోలోన వేదన చెందుతుండెడివాడు. తను బ్రహ్మజ్ఞాని కావలెనని ఎంతో కోరిక కలిగిఉండెను. యోగవిద్య సాధన చేస్తూ ఉండెడివాడు. **'మానసిక శాంతికి', 'మానసిక వికాశానికి'** యోగవిద్య సహాయపడుతుందని, వేదాంత సారము, శివయోగసారము, విజ్ఞాన దీపిక, సాంఖ్యయోగము, పరమహంస ధర్మము, మరియు ఆత్మజ్ఞానము ఇత్యాది గ్రంథములు పఠించి కంఠస్తము చేసెను.

**మత గురువుల వద్ద అభ్యాసము** : ఏడుగురు మత గురువుల యొద్ద శిష్యత్వము చేసెను. సమస్తభోగములను విడచి గురువుల పాదముల యొద్ద నిదురించెడివాడు. పరబ్రహ్మమును తెలుసుకొనుటకై గురువును ఆశ్రయించవలెనని పురుషోత్తముని ఉద్దేశము. కొందరు గురువులు చేయు నీచ కార్యమును కనులారా చూచి మనస్సు నందు నొచ్చుకొనెను. వారి మతగురువులు ఈ కవిగారి ఆధ్యాత్మిక దాహమును తీర్చలేక పోయిరి ఎన్నోయోగ సాధనాలు చేసినా మనస్సుకు ఏకాగ్రత లభించలేదు. శాంతి కరువైయింది. ఇవన్ని వట్టి భూటకమని తలంచాడు, ఇంకొక రాజయోగ కూటము అనేక మత గురువుల యొద్దకు వెళ్ళాడు. ఈ గురువులలోనే ఇంకొక మఠ ఉండేది. అక్కడు స్త్రీలు, స్వాములు ఉండేవారు. వీరిది వింతైన తంతు. వీరి యొక్క కార్యములను చూచి ఈ కవి గారికి స్వాములపై విరక్తి గలిగింది. ఈలాటిదె ఇంకొక గుంపు, వీరంతా గంజాయి, నల్లమందు, బంగు సేవించి ఎప్పుడు మత్తుతో ఉండేవారు. అస్సలు పరమాత్ముని సన్నిధి కానేకాదని, ఇదంతా బూటకమని తెలుసుకొని మనస్సున కలత చెందెను. అప్పటి నుండి ఎవరు నిజమైన దేవుడు అని అన్వేషణ ప్రారంభించాడు.

**నిజదేవుని అన్వేషణ** : అక్కడక్కడ అప్పుడే **యేసు ప్రభువు** గూర్చి చిన్న చిన్న కరపత్రములు పంచేవారు. **"నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించవలెను"** మత్తయి 22:19. ఈ మాటలు **పురుషోత్తముగారు** చదివి, ఈ మాటలు ఎక్కడివి? ఏ వేదాంతములో ఉన్నవి? ఈ అమూల్యమైన మాటలు ఎవరు పలికిరి? అని తనలోనే ప్రశ్నించుకొనెను. ఏ సత్‌పురుషుని నోట నుండి ఈ మాటలు పలికినవి అని అన్వేషించడము ప్రారంభించెను. **"నన్ను జాగ్రత్తగా వెదుకువారు, నన్ను కనుగొనెదరు"** అను వాక్యము బైబిలునందు వ్రాయబడింది అని తెలుసుకొని బైబిలు కొరకు అన్వేషణ చేయసాగెను. అప్పుడు తెలుగులో బైబిలు అచ్చువేయబడలేదు. ఈ కవిగారికి ఇంగ్లీషు రాకుండెను. 1800వ సంవత్సరము నందు కలకత్తా సమీపమందు సిరంపుర్‌లో **విలియం కేరీ** అనే భక్తుడు చిన్న చిన్న పత్రికలు తెలుగులో తర్జుమ చేసి ప్రజలకు దేవుని వాక్యము అందించుచుండెను. 1805వ సంవత్సరమందు **'లండన్ మిషన్ సొసైటీ'** వారిచే మత్తయి, మార్కు, లూకా అనే సువార్తలు అతి వ్యయ ప్రయాసలతో తెలుగులో ముద్రించిరి. ఆ కాలమందే **ఈస్ట్ ఇండియా కంపెనీ** వారు తిరుగుబాటు దారులను అణచివేయుటకు విజయనగరము, శ్రీకాకుళము పట్టణాలలో బస చేసిరి. కొందరు సైనికాధికారులు సువార్త ప్రచురణకు ప్రచారము చేయుచుండరి. క్రైస్తవ్యాన్ని భారత దేశములో వ్యాప్తింపచేయాలని పత్రికలు పంచుచుండిరి. ఇంకా **యేసు ప్రభువు** గురించి తెలుసుకోవాలని మీకు ఉద్దేశము ఉంటే మాకు ఉత్తరములు వ్రాయండి అని, వారి చిరునామా దిగువ అచ్చువేసిరి. ఈ పత్రిక కవిగారికి దొరికింది. వెంటనే వారికి ఉత్తరము వ్రాసాడు. **సదా సత్య స్వరూపి అయిన యేసు ప్రభువు** గురించి తెలుసుకోవాలని కోరిక కలిగెను. చౌధరిలో ఏదో మార్పు వచ్చిందని ప్రజలు, తన ఇంటివారును గ్రహించిరి. రస్పెల్‌గారు ప్రభువు నందు ఎంతో విశ్వాసము కలవాడు. ఇది చౌధరి తెలుసుకొని అతనిని కలుసుకొనడానికి వెళ్ళెను. ఆ సమయమందు సైనికులచే చాలా దెబ్బలుతిన్నాడు. తుదకు ఆ భక్తున్ని కలుసుకున్నాడు. ఆయన ప్రేమతో కవిగారిని కౌగలించుకొని, **యేసు ప్రభువు** గురించి అనేక సత్యములను బోధించెను. అప్పుడు ఇరువురు మోకరిల్లి ప్రార్థన చేసిరి. ప్రభువా నన్ను నీ సేవకు **ఈ విధంగా సంపాదించు కొంటివా స్వామి, నీ కార్యములు అద్భుతములని** ప్రార్థించి ఆనంద బాష్పములు రాల్చెను. ఆనాటి నుండి కవిగారి జీవితము మారిపోయింది. తన కుటుంబములో కలతలు రేగాయి, ఎన్నో నిందలు, శ్రమలు వచ్చాయి. తుదకు అందరిని విడచి 1833వ సంవత్సరం, అక్టోబర్ 6న క్రైస్తవ దీక్షను పొందెను. ఆ దినమే ఈ భక్తుడు ఒక రచన చేసెను.

**"మా యేసు క్రీస్తుని - మఱుగు గల్గెనురా**
**నాయాత్మ ఘన రక్షా - నగము నెక్కనురా!"**

అను ఈ కీర్తన గానము చేసెను. **ఇదే తెలుగులో వెలబడిన తొలి క్రైస్తవ భక్తి గీతము.** విశాఖ నుండి మద్రాసు చేరి మహాశ్రమ నొంది 440 మైళ్ళు కాలినడకన ప్రయాణము చేసి దారి పొడుగున సువార్తను ప్రకటిస్తూ, బళ్ళారి, గుంతకల్ అనంతరపురం, మదనపల్లి, రేణిగుంట,గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, మంగళగిరి, బెజవాడ, రాజమండ్రి, తుని నుండి విశాఖ చేరెను. ఈ స్థలాలన్ని క్రైస్తవ మత కేంద్రములు. 1835వ సంవత్సరమందు తన భార్య రాధామణి తనతో కలిసి ప్రభువు సేవ చేసెను. కవిగారిని మత గురువుగా అభిషేకించారు. విశాఖపట్టణములో తొలి సారిగా క్రైస్తవదేవాలయము స్థాపించబడింది. ఈ కవిగారు తెలుగు భాషకు మరియు ప్రత్యేకముగా తెలుగు క్రైస్తవ సంఘాలకు ఈయన చేసిన సేవ మహత్తరమైనది. అనేక రచనలు, పద్యాలు, అనేక పుస్తకములు **యేసు ప్రభువు** కొరకు తన కలము నుండి వెలువడెను. ఈ కవి కలము నుండి 130 అపురూపమైన భక్తిగీతాలు వెలుబడ్డాయి. **ఆంధ్రక్రైస్తవ కీర్తన అనే పుస్తకములో 78 పాటలు అచ్చువేయబడ్డాయి. 'కవి సామ్రాట్ చౌధరి పురుషోత్తము ట్రస్టు'** కూడా ఉన్నది. తన 87వ సంవత్సరమందు (1890) ఆగష్టు 23న అర్ధరాత్రి వేళ ప్రభువునందు నిద్రించెను. తను చనిపోతూకూడా కల్వరి గిరీశా, ప్రభు అంటూనే కన్ను మూశాడు. **"ఆమెన్"**




హైదరాబాదు
బాప్టిస్టు చర్చి
ప్రచురిస్తున్న
ఆధ్యాత్మిక
మాసపత్రిక
"సిలువ సాక్షి"

చదవండి... చదివించండి( సంవత్సర చందారూ.100/- ).
"సిలువ సాక్షి" మాసపత్రిక చందా గడువు పూర్తయి
ఇంకా చందా కట్టని వారు *"Dues"* వెంటనే
పంపి మాకు సహాయపడవలెనని ప్రార్థించుచున్నాము.
*"Dues"* ను ఆగష్టులో కట్టని వాళ్ళకు పత్రిక
ఈ మాసము ( సెప్టెంబరు) నుండి పంపబడదు.